జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం | 18 | ఏప్రిల్ | 2026 ◆ పేజీలు : 6

# గిరిజన విద్యాలయాల్లో వంద శాతం ప్రవేశాలే లక్ష్యం

- అశ్రద్ధ చేస్తే కఠిన చర్యలు తప్పవు
- ప్రభుత్వ వసతులపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి
- వసతి గృహాల్లో రిపేర్లకు వెంటనే ప్రతిపాదనలు పంపండి
- వీడియో కాన్ఫరెన్స్ లో ఐటీడీఏ పీవో బి. రాహుల్ ఆదేశం



2 లో...




2 లో..

# ట్రాఫిక్ నియమాలను పాటిద్దాం ప్రమాదాలను నివారిద్దాం

- ప్రజల సహకారంతోనే ప్రమాదాల నివారణ
- రహదారుల ప్రమాదాలపై అవగాహన అవసరం... ఐజి పి. చంద్రశేఖర్ రెడ్డి
- ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతే జీవితాలను నష్టపోతాం.. అంకిత్... జిల్లా కలెక్టర్
- రహదారి భద్రతకు.. మనందరం కట్టుబడదాం.... రోహిత్ రాజ్... భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ

# కట్టేది గోరంత.. దోచుకునేది కొండంత!



- మున్సిపల్ దివానాల వ్యవహారమే ఇది..
- దుకాణం తీసుకునేది ఒకరు.. అద్దెకు ఉండేది మరొకరు
- రూ 5 వేలకు పైగా అదనంగా భాదుడు!
- మున్సిపల్ శాఖ అధికారి అండదండలతోనే వ్యవహారమా?
- అధికారులు పట్టించుకుంటే మున్సిపాలిటీకి భారీగా ఆదాయం!


**ఇల్లందు, ఏప్రిల్ 17, ప్రజాజ్యోతి:** మున్సిపల్ షాపులు ప్రజల అవసరాల కోసం, పారదర్శకంగా కేటాయించాల్సిన వనరులు. కానీ ప్రస్తుతం ఇవే కొందరి ఆదాయ వనరులుగా మారి అద్దెల మాయజాలానికి కేంద్రంగా నిలుస్తున్నాయి. కట్టే అద్దె తక్కువగా చూపిస్తూ బయటకు మాత్రం భారీ మొత్తాల్లో వసూళ్లు చేస్తున్న

మిగతా 2 లో...

# మావోయిస్టుల డంప్ స్వాధీనం

**చర్ల, ఏప్రిల్ 17:(ప్రజా జ్యోతి ):** ఛత్తీస్గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా లో ఫర్సేగఢ్ పోలీస్ స్టేషన్ పరిధిలో డీఆర్జీ , బీడీఎస్ సంయుక్త బృందాలు పీల్లూర్–అన్నారం ప్రాంతాల్లో ఏరియా డామినేషన్ డీ–మైనింగ్ ఆపరేషన్లు నిర్వహిస్తున్న సమయంలో అందిన విశ్వసనీయ సమాచారం తో భద్రతా దళాలు అన్నాపూర్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ముందుగానేదాచిపెట్టిన పేలుడు పదార్థాలను గుర్తించారు . ఈ పదార్థాలను ఒక తెల్లని ప్లాస్టిక్ వాటర్ట్యాంక్లో భూమిలోదాచిపెట్టినట్లు గుర్తించారు.

**››› స్వాధీనం చేసుకున్న**



**పేలుడు పదార్థాలు :**

గంధకం – 50 కిలోలు, యూరియా – 2 బస్తాలు సుమారు 100 కిలోలు, గన్ పౌడర్ – 10 కిలోలు స్వాధీనం చేసుకున్నారు. భద్రతా దళాలు అన్ని జాగ్రత్తలు పాటిస్తూ భద్రతా ప్రమాణాలను అనుసరించి స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాలను సంఘటనా స్థలంలోనే

మిగతా 2 లో...

# ఉపాధ్యాయుని కుమార్తెగా పాఠశాలకు సేవ – పేద విద్యార్థులకు చేయూత

- పేద విద్యార్థులను ప్రోత్సహిస్తూ నిరంతర సహాయం చేస్తున్న డా. జి అభినయ
- సైకిళ్లు, క్రీడా దుస్తులు అందజేసి ఆదర్శంగా నిలిచిన లండన్ వైద్యురాలు



**అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 17, ప్రజాజ్యోతి:** అనపర్తి మండల కేంద్రంలో గల జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (బయోసైన్స్)గా పనిచేస్తున్న జి జవహర్ బాబు వారి కుమార్తె, లండన్ లో వైద్య వృత్తిలో కొనసాగుతున్న డాక్టర్ జి అభినయ అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల జడ్పీహెచ్ఎస్ పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థిని విద్యార్థులకు సేవ చేయాలనే ఉద్దేశంతో గతంలో సుమారు రూ. 6000 విలువగల సైకిళ్లను అందజేసిన ఆమె, శుక్రవారం జిల్లా, రాష్ట్ర స్థాయిలో క్రీడల్లో పాల్గొంటున్న విద్యార్థులకు

మిగతా 2 లో...

## కట్టేది గోరంత.. దోచుకునేది కొండంత!




(మొదటి పేజీ తరువాయి...)

దందా బహిరంగంగానే సాగుతుంది. అధికారుల నిర్లక్ష్యం ఈ అక్రమాలకు మరింత ఊతమిస్తుంది.పట్టణంలోని మున్సిపల్ పరిధిలో ఉన్న అనేక షాపులు అసలు కేటాయింపు నిబంధనలకు విరుద్ధంగా వినియోగంలో ఉన్నట్లు తెలుస్తుంది. ప్రభుత్వానికి లేదా మున్సిపాలిటీకి చెల్లించాల్సిన అద్దె చాలా తక్కువగా ఉండగా, అదే షాపులను మూడవ వ్యక్తులకు అధిక ధరలకు కిరాయికి ఇస్తున్నట్లు పక్కా సమాచారం. దీంతో మున్సిపాలిటీకి రావాల్సిన ఆదాయం కొట్టుకుపోతుండగా, మధ్యవర్తులు మాత్రం భారీగా లాభాలు ఆర్జిస్తున్నారని తెలుస్తుంది. ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే... కొందరు లీజుదారులు షాపులను స్వయంగా ఉపయోగించకుండా పూర్తిగా కిరాయి వ్యాపారంగా మార్చేశారన్నది కండ్లకు కనిపిస్తుంది. ఒకరికి కేటాయించిన షాప్ ను మరొకరి చేతిలో ఉండటం సాధారణంగా మారింది. నిబంధనల ప్రకారం ఇది పూర్తిగా నిషేధం అయినప్పటికీ, అమలు మాత్రం కనిపించడం లేదు.

### ››› అధికారుల నిర్లక్ష్యం..?

ఈ అక్రమాలపై స్థానికులు పలుమార్లు ఫిర్యాదులు చేసినా, మున్సిపల్ అధికారులు స్పందించకపోవడం విమర్శలకు తావిస్తుంది. తనిఖీలు జరగాల్సిన చోట కేవలం నోటీసులకే పరిమితమవుతున్న చర్యలు, ఈ దందాను మరింత పెంచుతున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ››› ప్రజల డిమాండ్!

మున్సిపల్ షాపుల కేటాయింపులు, అద్దెల వసూళ్లపై సమగ్ర దర్యాప్తు జరిపి, అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నిజమైన అర్హులకు షాపులు కేటాయించి, మున్సిపాలిటీ ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు.

››› **వ్యక్తిగత లాభాలకు వినియోగం** మున్సిపల్ ఆస్తులు కొందరి వ్యక్తిగత లాభాల కోసం వాడుకలోకి వెళ్తే, నష్టపోయేది చివరికి ప్రజలే. ఇప్పటికైనా అధికారులు మేలుకొని, అద్దెల మాయజాలానికి ముగింపు పలకాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## మావోయిస్టుల డంప్ స్వాధీనం

(మొదటి పేజీ తరువాయి...)

సురక్షితంగా నిర్వీర్యం చేశాయి.ప్రస్తుతం ఆ ప్రాంతంలో భద్రతా దళాలు నిరంతర సెర్చింగ్ ఏరియా డామినేషన్ డీ–మైనింగ్ చర్యలను కొనసాగిస్తూ శాంతి భద్రతలను పర్యవేక్షిస్తున్నాయి అని అధికారులు అన్నారు.అడవుల్లో లేదా ఇతర ప్రాంతాల్లో ఏదైనా అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా భద్రతా శిబిరానికి సమాచారం ఇవ్వాలని బీజాపూర్ పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేసారు.

## ఉపాధ్యాయుని కుమార్తెగా పాఠశాలకు సేవ – పేద విద్యార్థులకు చేయూత

(మొదటి పేజీ తరువాయి...)



సుమారు రూ. 6000 విలువ గల క్రీడా దుస్తులను బహుకరించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆశిస్తూ ఈ సహాయం అందజేసినట్లు డా. జి అభినయ తెలిపారు. తన తండ్రి ప్రోత్సాహం, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంతోనే ఈ స్థాయికి ఎదిగానని పేర్కొంటూ ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తూ విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తున్నారని, వారు జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరుస్తున్నారని చెప్పారు. విద్యతో పాటు క్రీడల్లో కూడా ముందంజలో ఉండేలా ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని వివరించారు.విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలు సాధించాలని, ఇటువంటి సేవా కార్యక్రమాలు మరింత మందికి ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు. భవిష్యత్తులో కూడా పాఠశాల అభివృద్ధికి సహకరించేందుకు ముందుకు వస్తానని డా. జి అభినయ పేర్కొన్నారు.డాక్టర్ జి అభినయ, డాక్టర్ ప్రియలను ఘనంగా సన్మానించడంతో పాటు జి జవహర్ బాబును కూడా సన్మానించారు. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొని ఆనందం వ్యక్తం చేశారు.

# ట్రాఫిక్ నియమాలను పాటిద్దాం ప్రమాదాలను నివారిద్దాం





**దమ్మపేట, ఏప్రిల్ 17, ప్రజాజ్యోతి** : ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ ప్రమాదాలను నివారించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ప్రజల సహకారంతోనే ప్రమాదాలను నివారించడం సాధ్యమవుతుందని ఐజిపి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న రహదారుల భద్రత వారోత్సవాలలో “అరైవ్ అలైవ్” కార్యక్రమంలో భాగంగా శుక్రవారం దమ్మపేటలో రహదారి భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా మరియు జిల్లాలో చోటుచేసుకున్న రహదారి ప్రమాదాలు, వాటి కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. గుడ్ సమారిటన్ విధానం, త్వరలో అమలులోకి రానున్న పీఎం అర్హత్ పథకం గురించి కూడా వివరించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించి ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించారు.ఈ సందర్భంగా ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు నిత్యం సైబర్ మోసాలు మరియు రహదారి ప్రమాదాలపై అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంట్లో ఉన్నప్పుడు సైబర్ మోసాలపై, బయటకు వెళ్లినప్పుడు రహదారి ప్రమాదాలపై జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. సైబర్ మోసాల్లో డబ్బులు కోల్పోతే తిరిగి సంపాదించుకోవచ్చు గానీ, రహదారి ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతే కుటుంబాలు తీవ్రంగా నష్టపోతాయని అన్నారు. గత ఏడాది జిల్లాలో 248 మంది రహదారి ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపడం, హెల్మెట్ ధరించకపోవడం, సీట్ బెల్ట్ ఉపయోగించకపోవడం వంటి కారణాలు ప్రమాదాలకు ప్రధాన కారణాలని చెప్పారు. గ్రామస్థాయిలో గ్రామసభల ద్వారా రహదారి భద్రతపై తీర్మానాలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం గ్రీన్ ఫీల్డ్ హైవేలు, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, వాహన తనిఖీలు వంటి చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రజలు కూడా తమ వంతు బాధ్యతగా రహదారి భద్రతను పాటించాలని పిలుపునిచ్చారు. ఈ ఏడాది ప్రమాదాలను తగ్గించే దిశగా కృషి చేయాలని అన్నారు.జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ “రహదారి ప్రమాదాల నివారణకు అవగాహన అత్యంత ముఖ్యమైనది. ‘అరైవ్ అలైవ్’ కార్యక్రమం ద్వారా జిల్లాలో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము. ముఖ్యంగా విద్యార్థులు, యువత ముందుకు వచ్చి సమాజంలో రహదారి భద్రతపై చైతన్యం కల్పించాలి. జిల్లాలో కేటీపీఎస్, బీటీపీఎస్, సింగరేణి వంటి పరిశ్రమల కారణంగా భారీ వాహనాల రాకపోకలు అధికంగా ఉండటంతో ప్రమాదాల అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని ఇప్పటికే 38 బ్లాక్ స్పాట్లను గుర్తించి, అక్కడ ప్రత్యేక చర్యలు చేపడుతున్నాము. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులకు తక్షణ వైద్యసహాయం అందేలా అంబులెన్స్ సేవలను బలోపేతం చేస్తున్నాము. అలాగే సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ట్రాఫిక్ నియంత్రణను మరింత సమర్థవంతంగా అమలు చేస్తున్నాము. ప్రజలు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చు. హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం, వేగ పరిమితులు పాటించడం వంటి అంశాలను ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలి. రహదారి భద్రతను ప్రభుత్వంతో పాటు ప్రజలు కూడా తమ బాధ్యతగా భావించి సహకరించాలన్నారు .జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ రహదారి ప్రమాదాల నివారణలో పోలీస్ శాఖతో పాటు మున్సిపల్, వైద్య, రవాణా తదితర శాఖల సమన్వయం కీలకమని అన్నారు. దేశవ్యాప్తంగా ప్రతి రోజు సుమారు 500 మందికి పైగా రహదారి ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మద్యం సేవించి వాహనం నడపడం, హెల్మెట్ ధరించకపోవడం, సీట్ బెల్ట్ వినియోగించకపోవడం, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడం వంటి కారణాలతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రజలు తమ హక్కులతో పాటు బాధ్యతలను గుర్తించి రహదారి భద్రతకు సహకరించాలని పిలుపునిచ్చారు.అనంతరం రహదారి భద్రతపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అలాగే కొంతమందికి డ్రైవింగ్ లైసెన్సులు అందించారు. పూసుకుంట గిరిజన కొండరెడ్డి సమాజానికి చెందిన వారికి హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పగడాల రమాదేవి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ వాసం రాణి,పాల్వంచ డిఎస్పి సతీష్, తాహసిల్దార్ రామ్ నరేష్,ఎంపీడీవో రవీందర్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులు, పోలీస్ శాఖ అధికారులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన విద్యాలయాల్లో వంద శాతం ప్రవేశాలే లక్ష్యం

**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 17:**, ప్రజాజ్యోతి ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రాబోయే విద్యా సంవత్సరంలో గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో విద్యార్థుల ప్రవేశాల సంఖ్యను గణనీయంగా పెంచాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ ఉపాధ్యాయులను, అధికారులను ఆదేశించారు. విధుల్లో అశ్రద్ధ వహించే హెచ్ ఎంలు, వార్డెన్లపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

శుక్రవారం సాయంత్రం ఐటీడీఏ కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పీవో పలు కీలక సూచనలు చేశారు:

### ››› పేరెంట్స్ మీటింగ్ లు.. సన్మానాలు

ప్రాథమిక పాఠశాలల్లో శనివారంతో పరీక్షలు ముగియనున్న నేపథ్యంలో, వెంటనే జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తి చేసి ప్రోగ్రెస్ రిపోర్టులు సిద్ధం చేయాలన్నారు. పాఠశాలల్లో పేరెంట్స్ మీటింగ్ ఏర్పాటు చేసి, ప్రభుత్వం అందిస్తున్న వసతులపై తల్లిదండ్రులకు వివరించాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులను గౌరవిస్తూ సన్మాన కార్యక్రమాలు నిర్వహించాలని, వేసవి సెలవులకు వెళ్లే పిల్లల భద్రతపై వారికి అవగాహన కల్పించాలని కోరారు.

### ››› వసతుల కల్పన - మరమ్మతులు

పాఠశాలలు, వసతి గృహాల్లో మేజర్, మైనర్ రిపేర్లు ఏవైనా ఉంటే తక్షణమే అంచనాలు తయారు చేసి పంపాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అద్దె భవనాల్లో ఉన్న పాఠశాలల యజమానులతో సమన్వయం చేసుకొని అవసరమైన రిపేర్లు చేయించాలన్నారు. "రాబోయే విద్యా సంవత్సరంలో అన్ని పాఠశాలలకు గ్రీన్ చాక్ బోర్డులు, డ్యూయల్ డెస్క్ బెంచీలు అందజేస్తాం. ఎస్.ఓ.ఈ ఖమ్మం, సి.ఓ.ఈ భద్రాచలం కళాశాలలకు కంప్యూటర్లు సమకూరుస్తాం" అని పీవో హామీ ఇచ్చారు.

### ››› బడిబాటలో చురుగ్గా పాల్గొనాలి

రాబోయే 'బడిబాట' కార్యక్రమంలో హెచ్ ఎంలు, వార్డెన్లు, స్పెషల్ ఆఫీసర్లు గ్రామాల్లో పర్యటించాలని పీవో స్పష్టం చేశారు. కాస్మోటిక్స్, యూనిఫాం, మెనూ, క్రీడా సౌకర్యాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. ఈ నెల 20న ప్రతి పాఠశాలలో స్కాలర్ షిప్ లపై అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు.

### ››› సమ్మర్ క్యాంప్ లకు సిద్ధం కావాలి

ఈ ఏడాది క్రీడలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పీవో తెలిపారు. సమ్మర్ క్యాంప్ కోసం ప్రతి పాఠశాల నుంచి నిష్ణాతులైన 60 మంది బాలురు, 60 మంది బాలికలను ఎంపిక చేయాలని, వారికి క్రీడలతో పాటు ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ లో శిక్షణ ఇస్తామని చెప్పారు.చివరగా, అనుమతి లేకుండా ఎవరూ సెలవులపై వెళ్లకూడదని, అందరూ సమన్వయంతో పని చేసి విద్యా సంవత్సరాన్ని విజయవంతం చేయాలని పీవో పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీడీ ట్రైబల్ వెల్ఫేర్ అశోక్, ఏసీఎంఓ రమేష్, స్పోర్ట్స్ అధికారి గోపాలరావు, గురుకులం ఏఓ నరేందర్ మరియు వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పోక్సో కేసుల్లో బాధితులకు తోడుగా భరోసా

- భరోసా పోలీస్ స్టేషన్ సేవలకు రెండేళ్లు పూర్తి
- పోక్సో, అత్యాచార కేసుల్లో బాధితులకు ప్రత్యేక సహాయం
- మానసిక బలం పెంపొందించేందుకు కౌన్సెలింగ్ సేవలు
- సమాజంలో ఆడపిల్లల భద్రతపై చైతన్యం కల్పిస్తున్న కార్యక్రమాలు






**కొత్తగూడెం, ఏప్రిల్ 17 (ప్రజాజ్యోతి):** పోక్సో, అత్యాచార కేసుల్లో బాధితులకు మానసిక బలం పెంపొందించేందుకు కౌన్సెలింగ్ సేవలే ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని ఏర్పాటైన భరోసా పోలీస్ స్టేషన్ సేవలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రెండేళ్లు పూర్తి అయ్యాయి. 2024లో ప్రారంభమైన ఈ భరోసా ప్రయాణం 2026 నాటికి విజయవంతంగా కొనసాగుతూ అనేకమంది బాధితులకు అండగా నిలుస్తూ ప్రజల్లో విశ్వాసాన్ని సంపాదించింది. కొత్తగూడెం ప్రగతి క్రీడా మైదానం సమీపంలో కొనసాగుతున్న ఈ భరోసా కేంద్రం ద్వారా జిల్లా వ్యాప్తంగా పలు విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నారు. భరోసా టీమ్ సభ్యుల ఆధ్వర్యంలో విద్యార్థులకు, ముఖ్యంగా బాలికలకు వ్యక్తిగత భద్రత, సైబర్ నేరాల నివారణ, చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమాల ద్వారా చిన్న వయస్సులోనే బాలికల్లో ధైర్యం, స్వీయ రక్షణపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా పని చేస్తున్నారు. ప్రత్యేకంగా పోక్సో (POCSO) మరియు అత్యాచార కేసుల్లో బాధితులు, వారి కుటుంబ సభ్యులకు భరోసా పోలీస్ స్టేషన్ అండగా నిలుస్తోంది. బాధితులకు కౌన్సెలింగ్, వైద్య సహాయం, చట్టపరమైన మార్గదర్శనం వంటి అన్ని అవసరమైన సేవలను ఒకే చోట అందిస్తూ పూర్తి స్థాయి సహాయం అందిస్తోంది. బాధితులు మానసికంగా కోలుకునేలా ప్రత్యేకంగా కౌన్సెలింగ్ సేవలు అందించడం ఈ కేంద్రం ప్రత్యేకతగా నిలుస్తోంది. ఈ కేంద్రం ముఖ్యంగా బాలికలు, మహిళలపై జరిగే తీవ్రమైన నేరాలపై దృష్టి సారించి సేవలు అందిస్తోంది.

### ››› ప్రతి కేసును సున్నితంగా పరిష్కరించే భరోసా బృందం

బాలికలు, మహిళలకు సంబంధించిన కేసులను బాధితుల మనోభావాలను గౌరవిస్తూ సున్నితంగా పరిష్కరించే విధంగా భరోసా టీమ్ పనిచేస్తోంది. బాధితులకు అవసరమైన అన్ని రకాల సహాయం అందిస్తూ వారికి భరోసా కల్పిస్తోంది. పోలీసు–ప్రజల మధ్య నమ్మకాన్ని పెంచుతూ భరోసా పోలీస్ స్టేషన్ సేవలు జిల్లాలో ఆదర్శంగా నిలుస్తున్నాయి. పోక్సో, అత్యాచార బాధితులకు అండగా నిలుస్తూ మానసిక ధైర్యం కల్పించడంలో భరోసా ముందంజలో ఉంది. బాధితులకు సత్వర స్పందన అందిస్తూ ప్రతి కేసును ప్రాధాన్యతతో తీసుకుని చర్యలు చేపడుతున్నారు. కేసుల పరిష్కారంలో సమన్వయంతో పనిచేస్తూ బాధితులకు న్యాయం జరిగేలా కట్టుబడి ఉన్నారు.

### ››› పోక్సో, అత్యాచార కేసుల్లో ప్రత్యేక దృష్టి: డబ్ల్యూఎస్ఐ చల్లా అరుణ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆధ్వర్యంలో పోక్సో, అత్యాచార కేసుల్లో ప్రత్యేక దృష్టిసారించడంతో పాటు బాలికలకు అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని భరోసా పోలీస్ స్టేషన్ డబ్ల్యూఎస్ఐ చల్లా అరుణ తెలిపారు. బాధిత బాలికల మానసిక బలం పెంపొందించేందుకు తమ బృందం అహర్నిశలు కృషి చేస్తోందని ప్రతి బాధితురాలికి న్యాయం అందేలా కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. పోక్సో (POCSO) మరియు అత్యాచార కేసుల్లో బాధితులకు సమగ్ర సహాయం అందిస్తూ కౌన్సెలింగ్ ద్వారా మానసిక బలాన్ని పెంపొందిస్తున్నామని తెలిపారు. సమాజంలో ఆడపిల్లలపై జరుగుతున్న నేరాలను అరికట్టడంలో అవగాహన కార్యక్రమాలు కీలకమని అందుకే విద్యాసంస్థలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. తల్లిదండ్రులు బాలికల పట్ల సున్నితంగా వ్యవహరించి ప్రమాదాల నుంచి కాపాడేందుకు ముందుకు రావాలని సూచించారు. ప్రతి పాఠశాల, కళాశాలలో, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రజల సహకారం అవసరమని తెలిపారు. భరోసా టీమ్ సభ్యులు కోఆర్డినేటర్ కమ్ కౌన్సిలర్ రేణుక, లీగల్ సపోర్ట్ పర్సన్ సిరీష, సపోర్ట్ పర్సన్ అంబిక, సపోర్ట్ పర్సన్ రామాదేవి, మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ సంధ్యారాణి, రిసెప్షనిస్ట్ అనూషలు ఉన్నారని తెలిపారు. భరోసా టీమ్ సభ్యుల సహకారంతో ఈ కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని అభినందించారు.






## తెలంగాణను అవమానించిన బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వెంటనే క్షమాపణ చెప్పాలి

### సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పుశెట్టి రాహుల్




**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 17, (ప్రజా జ్యోతి) :** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును దేశ విభజనతో పోల్చుతూ అవమానకర వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పుశెట్టి రాహుల్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాల పాటు సాగిన ప్రజాస్వామ్య పోరాటం, వేలాది మంది అమరవీరులు త్యాగాలతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని ఎవరి దయతో కాదన్నారు, వేలాది మంది విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు, కళాకారులు, గిరిజనులు, సబ్బండ వర్గాలు చేసిన పోరాటాలతో, బలిదానాలతో సాధించుకున్న హక్కన్నారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో శ్రీకాంత్ చారి, సిరిపురం యాదయ్య, కానిస్టేబుల్ కృష్ణయ్య, భోజ్య నాయక్, ప్రవీణ్ నాయక్ వంటి అనేకమంది అమరుల త్యాగాలు ఈ నేల గుండెల్లో చిరస్థాయిగా నిలిచాయిని అలాంటి పవిత్ర పోరాటాన్ని భారత్–పాకిస్థాన్ విభజనతో పోల్చడం అత్యంత అవివేకమన్నారు. అయన వ్యాఖ్యలు తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని మండిపడ్డారు. తెలంగాణ పోరాట చరిత్ర తెలియకుండా మాట్లాడిన ఎంపీ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. పార్లమెంట్ లో తెలంగాణపై ఇలాంటి వ్యాఖ్యలు వచ్చినప్పటికీ, తెలంగాణకు చెందిన ఎంపీలు మౌనంగా ఉండడం విచారకరమని ఆయన విమర్శించారు. బీజేపీ నాయకులు వెంటనే తమ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని రాష్ట్ర గౌరవాన్ని కాపాడే బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని, అలాంటి సమయంలో మౌనం అనేది తెలంగాణ ప్రజల భావోద్వేగాలను అవమానించడమేనన్నారు. బీజేపీ పార్టీ నాయకులు పదేపదే తెలంగాణపై వ్యతిరేక భావజాలాన్ని వ్యక్తం చేస్తూ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. తేజస్వి సూర్య వ్యాఖ్యలపై బీజేపీ పార్టీ కూడా స్పష్టమైన వైఖరి ప్రకటించి తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలి

- టీజీఈ జేఏసీ ఆధ్వర్యంలో తహశీల్దార్ కు వినతి



**బూర్గంపహాడ్, ఏప్రిల్ 17 (ప్రజా జ్యోతి):** రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని టీజీఈ జేఏసీ(తెలంగాణ ఎంప్లాయీస్, టీచర్స్, పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ) ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రమైన తహశీల్దార్ కార్యాలయంలో నాయకులు తహశీల్దార్ కేఆర్కే ప్రసాద్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు ఏళ్ల తరబడి పెండింగ్లో ఉండటంతో కుటుంబ, ఆర్థికపరంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా జూన్ 2వ తేదీ నాటికి పీఆర్సీ అమలుచేయడం, రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బిల్లులను క్లియర్ చేయడం, ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ ను రద్దు చేసి ఓపీఎస్ విధానం పునరుద్ధరించాలని, 2004 సెప్టెంబర్ 1కి ముందు నియామకమైన ఉద్యోగులకు ఓపీఎస్ అమలు చేయాలని, పెండింగ్ డీఏ బకాయిలు విడుదల చేయడంతో పాటు 61 ఏళ్లు నిండిన వీఆర్ఎల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని జేపీసీ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో యదుసింహరాజుతో పాటు ఆయా శాఖల ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉద్యోగులకు పీఆర్సీ వెంటనే అమలు చేయాలి

- ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నిరసన
- ప్రభుత్వ ఉద్యోగుల, ఉపాధ్యాయుల సమస్యలపై తాసిల్దార్ కు టీజీఈజెఏసి నాయకులు వినతి పత్రం అందజేత

**టేకులపల్లి, ఏప్రిల్17, ప్రజాజ్యోతి:** ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పీఆర్సీ వెంటనే అమలు చేయాలని కోరుతూ ఉద్యోగులు శుక్రవారం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం ఎమ్మార్వో వీరభద్రంకు టీజీఈజెఏసి మండల శాఖ అధ్యర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీజీఈజేఏసీ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఇచ్చే రెండవ పిఆర్సిని 51 శాతం సెంటిమెంట్తో వెంటనే అమలు చేయాలని జెఏసి నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో అలసత్వం విధానం మానుకోవాలని వారు అన్నారు. వచ్చే సాధారణ ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వాన్ని తగిన గుణపాఠం తెలుపుతామని సందర్భంగా హెచ్చరించారు. రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన న్యాయపరమైన బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన డిఏలు పిఆర్సి లను సకాలంలో అందేటట్లు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. సిపిఎస్ ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి. ఉద్యోగులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని ప్రధానంగా ప్రభుత్వం దృష్టిలో ఉన్న 61 డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయ సంఘాల తోటి చర్చలకు జరపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టేకులపల్లి టీజీఈజెఏసిమండల బాధ్యులు, పిఆర్టియు అధ్యక్ష కార్యదర్శులు రమేష్, రమణ, మోతీలాల్ యూటీ ఫ్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, హరికుమార్, సిపిఎస్ సంఘము నాగునాయక్, పులసింగ్, వెంకట్రాం, దివ్యాంగ ఉద్యోగ , ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాణోత్ లక్ష్మా నాయక్, బోడ సుజాత, ఇంకా వివిధ సంఘాల జిల్లా నాయకులు రామచందర్, మాన్సింగ్, బాలాజీ, రవీందర్, పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు, మహి ళా ఉపాధ్యా యులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు



## రైతు సంఘం రాష్ట్ర మహాసభల ఏర్పాట్ల పరిశీలన



**కొత్తగూడెం, ఏప్రిల్ 17 ( ప్రజాజ్యోతి )**తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర మూడవ మహాసభలు ఈ నెల 23, 24, 25 తేదీల్లో కొత్తగూడెం పట్టణంలో నిర్వహించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను సంఘం రాష్ట్ర నేతలు పరిశీలించారు. ఎఐకెయస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు కార్యక్రమ స్థలాలను సందర్శించారు. కొత్తగూడెం క్లబ్‌లో ఏర్పాటు చేసిన ప్రారంభ సభ వేదిక, సభ ప్రాంగణం, ప్రతినిధుల హాల్, భోజనశాలలను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అధిక సంఖ్యలో ప్రతినిధులు హాజరవుతున్నందున ఎటువంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా నాయకత్వాన్ని ఆదేశించారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని తాగునీరు, నీడ, ఇతర సౌకర్యాలు సమృద్ధిగా ఏర్పాటు చేయాలని సూచించారు. మహాసభ విజయవంతం కోసం జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ప్రచారం, ఏర్పాట్లపై నాయకులు వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య, ఏజే రమేష్, కే బ్రహ్మచారి, లిక్కి బాలరాజు, భూక్య రమేష్, నాగకృష్ణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లుపై నిరసన




**కొత్తగూడెం, ఏప్రిల్ 17 ( ప్రజాజ్యోతి )**మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం కాలయాపన చేస్తోందని జిల్లా భారత జాతీయ మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి మున్నా లక్ష్మీకుమారి విమర్శించారు. పట్టణంలోని రామాటాకీస్ రోడ్డులో సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేపట్టారు. ఆమె మాట్లాడుతూ జనగణన నియోజకవర్గాల పునర్విభజనతో రిజర్వేషన్ల అమలును అనిశ్చితంగా మార్చిందని మండిపడ్డారు. మహిళా హక్కులను దెబ్బతీసే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ల సాధన కోసం కమ్యూనిస్టులు చేసిన పోరాటాన్ని అవమానిస్తున్నారని పేర్కొన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈసంశెట్టి పద్మజ, మావిడాల ధనలక్ష్మి, పోలుమూరి ధనలక్ష్మి, మునిగడప పద్మ, సత్తెనపల్లి విజయలక్ష్మి, పైడిపల్లి లక్ష్మి, షేక్ షాహిన్, కైసర్, రమాదేవి, షమీమ్, లత తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం

**చుంచుపల్లి, ఏప్రిల్ 17 ( ప్రజాజ్యోతి )**ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ తెలిపారు. రుద్రంపూర్‌లోని సింగరేణి ఆర్‌సీఓఏ క్లబ్‌లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, కొత్తగూడెం ఏరియా జీఎం ఎం. శాలెం రాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి పౌరుడి బాధ్యత కీలకమని పేర్కొన్నారు. వాహనం నడిపేటప్పుడు హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం తప్పనిసరిగా చేయాలని సూచించారు. జీఎం శాలెం రాజు మాట్లాడుతూ రోడ్డు భద్రతపై అవగాహన సమాజ అభివృద్ధికి అవసరమని తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు ప్రతాప్, కరుణాకర్, ఇంద్రాసేనరెడ్డి, వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ ఎస్సై ప్రవీణ్‌కుమార్, రుద్రంపూర్ సర్పంచ్ బానోత్ కేస్లీ, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## బాల్యవివాహాలను అంతం చేసి
# ఆడపిల్లలకు బంగారు భవిష్యత్తును అందిద్దాం

- **డి ఆర్ డి ఏ విద్యా చందన**

**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 17,(ప్రజా జ్యోతి)**



బాల్య వివాహాలను అంతం చేసి ఆడపిల్లలకు బంగారు భవిష్యత్తును అందిద్దామని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారిని విద్యా చందన, జిల్లా సంక్షేమ అధికారిని స్వర్ణలత లెనినా లు పిలుపునిచ్చారు, ఎయిడ్స్ సంస్థ ఆధ్వర్యంలో జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ వారి సౌజన్యంతో బాల్య వివాహాల నిర్మూలనకై ఏర్పాటు చేసిన గోడ పత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు, బాల్య వివాహాల నిర్మూలనకై అందరూ నడుం బిగించాలని, బాలల యొక్క భవిష్యత్తుకు ఎంతో కీలకమని, బాల్య వివాహాలు అనేవి ఒక సామాజిక దురాచారం, అనదిగా కొనసాగుతున్నటువంటి ఈ సాంఘిక దురాచారాన్ని అందరం కలిసి సమూలంగా నిర్మూలించాలనీ కోరారు, బాల్య వివాహం అనేదే లేని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కై నిరంతరం శ్రమించాలని విద్యాచందన పిలుపునిచ్చారు. అనంతరం ఏప్రి ల్ 19 అక్షయ తృతీయ సందర్భంగా యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ (ఎయిడ్) సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన గోడ పత్రికను ఆమె చాంబర్లో ఆవిష్కరించారు.జిల్లా యం త్రాంగం ఆధ్వర్యంలో అనునిత్యం గ్రా మస్థాయిలో అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామని బాలల పరిరక్షణ విభాగం ద్వారా బాలలకు సేవలను అందిస్తున్నట్లు తెలిపారు . చిన్న వయసు లోనే వివాహం చేయడం వల్ల బాలికలకు శారీరక మానసిక ఆరోగ్య రుగ్మతలు వస్తాయని సరైన పరిపక్వత లేక పుట్టే పిల్లలు కూడా అనేక రకాల లోపాలతో పుట్టడం వల్ల జీవితాంతం ఆ మనోవేదన అనుభవించాల్సి వస్తుందని కొన్ని సందర్భాలలో మాత శిశు మరణాలు కూడా జరుగుతాయని ,ఈ నష్టాల వలన స్త్రీ పురుష నిష్పత్తి కూడా గణనీయంగా పడిపోతుందని జిల్లా సంక్షేమ అధికారిని ఆఫీసర్ స్వర్ణలత లెనినా తెలిపారు.ఈ కార్యక్రమంలో డిపిఎం లు డి సమ్మక్క , నర్మద , ఏపిఎం అనురాధ,ఎయిడ్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ వి రాజేష్ కమ్యూనిటీ సోషల్ మొబిలైజర్స్ మోహన్ , మాన్సింగ్,జ్యోతి, మౌనిక తదితరులు పాల్గొన్నారు

## పాల్వంచ మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ అధికారుల విచారణ



**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 17,(ప్రజా జ్యోతి)** పాల్వంచ మున్సిపల్ కార్యాలయంలో అవినీతి ఆరోపణలు ఉన్నాయన్న నేపథ్యంలో ఇటీవల ఏసీబీ డిఎస్పి వై రమేష్ ఆధ్వర్యంలో తనిఖీ చేసిన విషయం తెలిసిందే, ఆ సందర్భంగ జరిగిన తనిఖీ లో ఏసీబీ విచారణ అనంతరం ఆనాడు డి.ఎస్.పి వైరమేష్ మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న కార్యాలయ సిబ్బంది నుండి కొంత నగదును ,సెల్ ఫోన్ లను, వివిధ పత్రాలను స్వాధీనం చేసుకొని వెళ్లారు, ఈ విషయంపై ఖమ్మం నుండి ఏసీబీ అధికారులు శుక్రవారం పాల్వంచ మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి విచారణ చేపట్టారు, ఈ విషయంపై పాల్వంచ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాతను వివరణ కోరగా గతంలో నిర్వహించిన ఏసీబీ సోదాలకు సంబంధించిన అంశాలపై సమీక్ష నిర్వహించేందుకు మాత్రమే అధికారులు వచ్చారని తెలిపారు, ఆ సమయంలో జరిగిన పరిశీలనకు సంబంధించి వివరాలు తెలుసుకోవడానికి సిబ్బందితో చర్చించి అవసరమైన సమాచారాన్ని సేకరించిన అనంతరం ఎసిబి అధికారులు వెళ్లిపోయారని కమిషనర్ వివరించారు, ప్రస్తుతం ఎలాంటి కొత్త సోదాలు తమ కార్యాలయంలో జరగలేదని కేవలం పూర్వ చర్యలపై సమీక్ష మాత్రమే జరిగిందని వివరణ ఇచ్చారు.

## భద్రాచలంలో అరైవ్ అలైవ్ కార్యక్రమం




**భద్రాచలం, ఏప్రిల్ 17, ప్రజాజ్యోతి** భద్రాచలంలో శుక్రవారం పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో అరైవ్, అలైవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంకు ముఖ్య అతిధిగా హాజరైన భద్రాచలం ఎఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ ప్రతి పౌరుడి సామాజిక బాధ్యతని, ప్రజలంతా ట్రాఫిక్ నిబందనలు పాటిస్తూ వాహనాలను నడపాలని, అలాగే మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని తెలిపారు. ప్రతి వాహనదారుడు తగిన దృవీకరణ పత్రాలు కలిగి ఉండాలని తెలిపారు ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ముదిగొండ రామకృష్ణ, పోలీసులు పాల్గొన్నారు.

## మాదిగలకు 11 శాతం రిజర్వేషన్ కలిగించాలి

- **ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు రమణయ్య**



**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 17,(ప్రజా జ్యోతి)** తెలంగాణ రాష్ట్రం అమలు చేస్తున్న 15% రిజర్వేషన్లలో వర్గీకరణ ప్రకారం జనాభా ప్రాతిపదికన 11% రిజర్వేషన్లు మాదిగలకు కేటాయించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు దేవంగి రమణయ్య డిమాండ్ చేశారు ,శుక్రవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాదిగల జనాభా 10 శాతం నుండి 11 శాతం వరకు ఉంటుందని, తమ అధినేత మందకృష్ణ మాదిగ మొదటి నుండి చెబుతున్న అది కుల గణన సర్వే తో స్పష్టమైందనీ, కుల గనన ఇంకా పూర్తిస్థాయిలో శాస్త్రీయంగా జరగలేదనీ ,అలా జరిగితే మాదిగ జనాభా ఇంకా రెట్టింపు స్థాయిలో పెరుగుతుందనేది నిజం అన్నారు ,కొంత మంది మేధావుల ముసుగులో జాతికి అన్యాయం చేసే విధంగా కేటాయించిన తొమ్మిది శాతం రిజర్వేషన్లను స్వాగతించారువారు జాతికి ద్రోహం చేశారు అనేది రుజువైందనీ, పాలకుల మెప్పు కోసం జాతికి అన్యాయం చేసే విధంగా వ్యవహరించిన ద్రోహులకు జాతిలో స్థానం ఉండదన్నారు, ఎస్సీ వర్గీకరణ చట్టం వచ్చే సందర్భంలోనే మందకృష్ణ మాదిగ 11 శాతం వాటా మాదిగలకు కేటాయించాలని రేవంత్ రెడ్డిని స్వయంగా కలిసి విజ్ఞప్తి చేశారని, మాదిగలకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాల్సిన బాధ్యత ప్రస్తుతం రేవంత్ రెడ్డి పై ఉందన్నారు, మందకృష్ణ మాదిగ నేతృత్వంలో మాదిగ జాతి మరింత సంఘటితమై బలమైన శక్తిగా ఎదగాలని పిలుపునిచ్చారు, మహాత్మ జ్యోతిరావు పూలే ద్విశత జయంతి ఉత్సవాల అత్యున్నత కమిటీలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ కి చోటు కల్పించినందుకు దేశ ప్రధాన మంత్రికి నరేంద్ర మోడీ కి మాదిగ జాతి తరపున కృతజ్ఞతలు తెలిపారు, వంగూరి రామ్మూర్తి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి సోమయ్య జిల్లా కన్వీనర్ నల్లగట్ల వెంకన్న, . ఎం ఎస్ పి వర్కింగ్ ప్రెసిడెంట్ ఇసంపల్లి కృష్ణ . కొమ్ము హుస్సేన్ , వల్లెపోగు వెంకటేశ్వర్లు , చాపల మడుగు వెంకటేశ్వర్లు . గంగపురి శ్రీను , సీనియర్ నాయకులు రావులపల్లి ఈశ్వరయ్య , నల్లగట్ల తిరుపతయ్య , మహిళా నాయకురాలు వేల్పుల సూర్య వాణి. తెల్లం సమ్మక్క. సమత. తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగస్తుల సమస్యలు పరిష్కరించాలి





**చర్ల, ఏప్రిల్ 17:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో శుక్రవారం రాష్ట్ర ఉద్యోగుల సంఘం నాయకుల ఆదేశాల మేరకు ఏం ఆర్ ఓ ఆఫీసు వద్ద ఉద్యోగుల 63 సమస్యల పై నిరసన కార్యక్రమం చేసి అనంతరం ఏం ఆర్ ఓ శ్రీనివాస రావుకి వినతిపత్రం అందజేశారు. ఏం ఆర్ ఓ కలెక్టర్ కి తెలియజేస్తాను అని హామీ ఇచ్చారు.ఈ సందర్భగా వారు మాట్లాడుతూ 2024 నుండి రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ బెనిఫిట్స్ వెంటనే ఇవ్వాలని 5 డిఏ లు వెంటనే ఇవ్వాలని పీ ఆర్ సి వెంటనే ప్రకటించాలని హెల్త్ స్కీమ్ వెంటనే అమలు చేయాలనిసి పీ ఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమ లు చేయాలనిరాష్ట్రం లో ఉద్యోగ ఉపాధ్యాయల మరియు పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని లేని ఎడల మే 5 నుండి నిరహర దీక్షలు చేపడతామని హెచ్చరించారు .కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఉద్యోగులకు అనేక హామీలు ఇచ్చి మర్చిపోయింది అని కొత్త హామీలు అమలు చేయకపోయినా మాకు రావలసిన పాత రాయితీలను కూడ అపేసింది అని ఆవేదన వ్యక్తం చేశారు వెంటనే మా సమస్యలు పరిష్కరించాలని కోరారు .ఈ కార్యక్రమంలో వి .బాలకృష్ణ, కె రాంబాబు, సి హెచ్ హిమగిరిబాబు, కె శ్రీలక్ష్మి ,శ్యామల రామారావు, టి .లక్ష్మిపతి ,బత్తుల శ్రీనివాసరావు, పీ నరసింహరావు, దొడ్డి తాతారావు, ఆడెపు ముత్యాలరావు, అంకాల శ్రీనివాసరావు ఆశపు శంకర్, ఏ నాగేశ్వర్రావు, ఏ టి ఎఫ్ , యు టి ఎఫ్ , పీ ఆర్ టి యు ఉపాధ్యాయ సంఘ నాయకులు ఇతర ఉద్యోగ సంఘ నాయకులు రిటైర్డ్ ఉద్యోగులు అనేక మంది ఉద్యోగులు పాల్గొన్నారు.

## తక్షణమే ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

- వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద రైతుల ఆవేదన



**బూర్గంపహాడ్, ఏప్రిల్ 17 (ప్రజా జ్యోతి ):** బూర్గంపహాడ్ మండలంలో ధాన్యం కొనుగోళ్లు తక్షణమే చేపట్టాలని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రమైన బూర్గంపహాడ్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం ఆరబోసిన రైతులు కొనుగోళ్లు చేపట్టకపోవడంతో యార్డు వద్ద తమ ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో గత నెలరోజులుగా ముమ్మరంగా వరికోతలు జరుగుతున్నాయని, కోసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో మార్కెట్ యార్డులోనో, రోడ్ల పక్కనో, రైతుల కల్లాల్లోనో ఆరబెట్టుకుని కొనుగోళ్ల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. అకాల వర్షాల సంభవిస్తే ఆరుగాలం కష్టించి పండించిన పంట నీటిపాలయ్యే అవకాశం ఉందని...ఈ క్రమంలో పగలనకా...రాత్రనకా పంటను కాపాడుకోవాల్సి వస్తుందని అన్నదాతలు తమ ఆక్రందన వ్యక్తం చేశారు. ఇది అదునుగా భావిస్తున్న దళారులు పండించిన పంటకు సరైన మద్ధతు ధర చెల్లించకుండా పలు కారణాలతో తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ తమ కష్టాన్ని దోచుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రోజుల తరబడి ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులతో పాటు బీఆర్ఎస్ నాయకులు కేవీ రమణ ఉన్నారు.

## రోడ్డు ప్రమాదాల్లో ప్రాణరక్షణకు గోల్డెన్ అవర్ కీలకం

- ఆర్టీఓ కార్యాలయంలో అవగాహన
- సీపీఆర్‌పై ప్రాక్టికల్ శిక్షణ



**చుంచుపల్లి , ఏప్రిల్ 17 ( ప్రజాజ్యోతి )** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక–99 రోజుల కార్యక్రమం లో భాగంగా రోడ్ సేఫ్టీ అవేర్‌నెస్ వీక్‌లో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ శుక్రవారం ఆర్‌టీఓ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి తక్షణ చికిత్స అందించే గోల్డెన్ అవర్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ప్రమాదం జరిగిన వెంటనే సరైన చర్యలు తీసుకుంటే ప్రాణాలను కాపాడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వివరించారు. డ్రైవర్లు, సిబ్బంది మరియు ప్రజలకు సీపీఆర్ (కార్డియో పల్మనరీ రెసిస్సిటేషన్) విధానంపై ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. ప్రాక్టికల్ డెమో ద్వారా గుండె ఆగిన పరిస్థితుల్లో ఎలా స్పందించాలి ఎలాంటి దశల్లో చికిత్స అందించాలి అనే విషయాలను స్పష్టంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ప్రతాప్, ఆర్‌బీఎస్‌కే మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుందర్‌తో పాటు ఆర్‌టీఓ సిబ్బంది పాల్గొన్నారు. ప్రమాద సమయంలో తక్షణ స్పందన ప్రాణరక్షణ చర్యలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు.

## ఎన్ డి ఆర్ ఎఫ్ అవగాహన సదస్సు





**చర్ల, ఏప్రిల్ 17:(ప్రజా జ్యోతి ):** చర్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్ డి ఆర్ ఎఫ్ ) ఆధ్వర్యంలో కమ్యూనిటీ అవగాహన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమం పదోవ బెటాలియన్ కమాండెంట్ ప్రసన్నకుమార్ ఆదేశాల మేరకు ఎఫ్ / 10వ బెటాలియన్‌కు చెందిన 10(ఆర్ ), ఇన్‌స్పెక్టర్ థ. బిటెన్ సింగ్ ఆధ్వర్యంలో 19 మంది రెస్క్యూ సిబ్బందితో కలిసి మొత్తం 20 మంది బృందం నిర్వహించారు.ఈ అవగాహనా సదస్సులో విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భద్రతా చర్యలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే విధానం గురించి అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు, భూకంపాలు, ఉరుములు–మెరుపులు, గాలివానలు, వరదలు వంటి సహజ విపత్తులపై ప్రజలకు వివరణ ఇచ్చారు. అలాగే ఫస్ట్ ఎయిడ్, ఎవాక్యుయేషన్ విధానాలు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్రాథమిక అంశాలపై ప్రాక్టికల్ డెమోలను నిర్వహించారు.అదనంగా ప్రస్తుత వేసవి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని హీట్‌వేవ్ సమయంలో పాటించాల్సిన వాటి గురించి విద్యార్థులు . స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ అవగాహన కార్యక్రమం ద్వారా 22 మంది విద్యార్థులు, 32 మంది సాధారణ ప్రజలు, 16 మంది రెవెన్యూ సిబ్బంది, 18 మంది స్టాఫ్ కలిపి మొత్తం 88 మంది ఎన్ డి ఆర్ ఎఫ్ కార్యక్రమం పై అవగాహన పెంపొందించుకున్నారు.ఈ కార్యక్రమంలో అధికారులు ఎం. శ్రీనివాస్ ఎంఆర్వో, కె. ఎడయ్య (ఎంపీడీఓ), శ్రీ శ్రీనివాస్ (ఆర్ఎస్ఐ), ఎస్. ముద్దరాజ్ (డిప్యూటీ ఎంఆర్వో), నరసింహారావు (ఎంఆర్ఐ) ,ఇన్స్పెక్టర్ బిట్టన్ సింగ్ వారి బృందం,హెడ్ కానిస్టేబుల్ గోవిందరావు, హెడ్ కానిస్టేబుల్ సురేష్,కానిస్టేబుల్ తిరుపతి రావు, కానిస్టేబుల్ పృధ్వి కుమార్ ,కానిస్టేబుల్ సుమంత్ కుమార్,కానిస్టేబుల్ చిన్ని రాము,కానిస్టేబుల్ దేశాయి దాదాజీ, కానిస్టేబుల్ సాయి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి :ఏఐకేఎంఎస్




**గుండాల. మార్చి. 17. ప్రజాజ్యోతి.** గుండాల మండలంలో గుండాల కాచనపల్లి శెట్టిపల్లి గ్రామాలలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతూ ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు శుక్రవారం ఏ ఐ కె ఎమ్ ఎస్ ఆధ్వర్యంలో తాసిల్దార్ కు వినతి పత్రం అందజేసిన అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆ సంఘం జిల్లా నాయకులు కోరం సీతారాములు పూణెం రంగయ్యలు మాట్లాడారు, గుండాల మండలంలో ప్రాథమిక సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు చేయాలని కోరారు మండలంలో రెండో పంటగా యాసంగి పండగ అధికంగా మొక్కజొన్న పండించారని రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు ప్రభుత్వం రైతుకు మద్దతు ధర కల్పించడంతోపాటు ప్రతి గింజను కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు వ్యాపారుల వద్ద అమ్ముకోవాల్సి వస్తుందని దీంతో వ్యాపారులు 1700 రూపాయలకే కొనుగోలు చేస్తున్నారని దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు యాసారపు వెంకన్న గడ్డం లాలయ్య ఆర్ఎం నరేష్ పరిషత్ రవి మానాల ఉపేందర్ పెండేకట్ల పెంటన్న మంగయ్య లాలు ఎల్లన్న నరసయ్య రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీ మహిళలకే ఇసుక సొసైటీ ఏర్పాటు చెయ్యాలి



**చర్ల, ఏప్రిల్ 17:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలోని కలివేరు గ్రామ పంచాయతీలో గల ఆదివాసీ మహిళల పేరిట ఇసుక సొసైటీ ఏర్పాటు చెయ్యాలని ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్ ఇరప.రాజు దొర డిమాండ్ చేశారు.ఈ సందర్భగా శుక్రవారం పత్రిక ప్రకటన విడుదల చేశారు.కలివేరు గ్రామంలో ఆదివాసీ మహిళల పేరిట ఇసుక సొసైటీ ఏర్పాటు చేసి ఆదివాసీ మహిళలు, జీవనోపాధి పొందే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఆర్థికంగా అండదండలు అందించాలని ఇందుకోసం గిరిజన సంక్షేమ శాఖ భద్రాచలం ఐటిడిఏ ద్వారా ప్రత్యేక నిధులు విడుదల చేయ్యలని విజ్ఞప్తి చేశారు.ప్రభుత్వం నుండి సరైన ఆర్థిక సహకారం ఇవ్వకపోతే ఆదివాసీ మహిళలు ప్రైవేట్ కాంట్రాక్టర్లను,బినామీలను బ్రోకర్ లను, గిరిజనేతరలను నమ్మి మోసపోవాల్సి వస్తోందన్నారు. ఈ విషయమై భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

## జమాతే ఇస్లామీ హింద్ భద్రాచలం శాఖ ఆధ్వర్యంలో చలివేంద్రాలు ప్రారంభం

**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 17, ప్రజాజ్యోతి,** భద్రాచలంలో శుక్రవారం జమాతే ఇస్లామీ హింద్ భద్రాచలం శాఖ ఆధ్వర్యంలో క ఇండస్ట్రియల్ ఏరియా, చర్ల రోడ్, మదీనా వుడ్ వర్క్ ప్రాంతంలో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాలను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జిందా, జామా మసీదు ప్రధాన కార్యదర్శి సలీం చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మత పెద్దలు మునాఫ్, జామీ మజీద్ అధ్యక్షులు షఫీ మాట్లాడుతూ స్వచ్ఛంద సేవా కార్యక్రమాలలో ముందుండి నడిపిస్తున్న యువతను అభినందిస్తున్నట్లు తెలిపారు. వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఇలాంటి కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మునాఫ్, అబ్దుల్ రెహమాన్, జానీ,ముజీబ్, మౌలాలి. మదర్ ఇర్షాద్, గౌస్, ఆసిఫ్, జామి మసీద్ అధ్యక్షులు షఫీ,రబ్బన సర్వర్ ,జలీల్, ఉస్మాన్, అబ్దుల్ కలాం పాల్గొన్నారు.



## రామాలయంలో ప్రారంభమైన తరలింపు పనులు



**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 17 , ప్రజాజ్యోతి,** భద్రాచలంలో వచ్చే నెల నుంచి రామాలయ అభివృద్ధి పనులు ప్రారంభం కానుండటంతో శుక్రవారం నుంచి రామాలయంలో స్వామి వారి తిరువీధి సేవలకు ఉపయోగించే పలు వాహనాలను తరలించే ప్రక్రియ ప్రారంభమైంది. ఈ క్రమంలో సూర్యప్రభ వాహనం, చంద్రప్రభ వాహనంతో పాటు పలు వాహనానాలు రంగనాయకుల గుట్టపై ఉన్న ధాన్య మందిరం, రంగనాథ స్వామి వారి ఆలయంలోకి తరలించారు. అలాగే ఈ నెల 26 రామాలయంలో కీలక ఘట్టం చోటు చేసుకోనుంది. రామాలయంలోని దక్షిణం వైపు ఉన్న ఉప ఆలయాల్లోని విగ్రహాల తరలింపుకు శ్రీకారం చుట్టనున్నారు. అలాగే లక్ష్మీతాయారు ఆలయంలోని అమ్మవారిని, ఆండాళ్లమ్మవారిని ఆలయంలోని అంతరాలయంలోకి తరలించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే అంతరాలయంలో ఇందుకు సంబంధించిన పనులు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం రూ.351 కోట్లను చేపట్టబోయే పనులకు వచ్చే నెల నుంచి శ్రీకారం చుట్టనున్నారు. ఇందుకోసం రామాలయ ఆవరణలోని ప్రస్తుతం ఉన్న చిత్రకూట మండపం, దక్షిణం వైపు ఉన్న రామానుజకూటం, ఉప ఆలయాలతో పాటు ప్రస్తుతం ఉన్న ప్రసాదాల కౌంటర్, ఉత్తరం వైపు ఉన్న నిత్యకల్యాణ మండపం, ఇతర నిర్మాణాలను తొలగించి అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఈ తొలగింపు పనులను రూ.4 కోట్లతో చేపట్టేందుకు అంచనాలను రూపొందించారు. కాగా బుధవారం రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సైతం సమీక్షించి తొలగింపు పనులను త్వరగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దీంతో తరలింపు పనులను శుక్రవారం నుంచి అధికారులు ప్రాథమికంగా ప్రారంభించారు.

## మాకు న్యాయం చేయండి

- **శ్రీ రామ ఇసుక సొసైటీ మహిళలు**

**చర్ల, ఏప్రిల్ 17:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో శుక్రవారం కలివేరు గ్రామ పంచాయతీ వద్ద శ్రీ రామా ఇసుక సొసైటీ మహిళా సభ్యులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలివేరు గ్రామ ఆదివాసి గిరిజన మహిళలము ఇసుక సొసైటీ రిజిస్ట్రేషన్ నిమిత్తము మూడేళ్లుగా పోరాడగా నాలుగు నెలల క్రితం క్రితం కలెక్టరు గ జితేష్ వి పాటిల్ సలహా ఆదేశానుసారము మేము '3' సొసైటీ వాళ్ళము కలిసిపోయి 'శ్రీరామ' అను పేరు మీద ఒక సొసైటీని ఆన్లైన్ రిజిస్ట్రేషన్ చేయించటమైనది అని పర్మనెంట్ రిజిస్ట్రేషన్ కొరకు జిల్లా సహకార అధికారి డి సి ఓ శ్రీనివాస్ కి తెలియపర్చగా, వారు ఆర్ సి నెంబర్ 878/25-సి 16-2-2026 ద్వారా అసిస్టెంట్ రిజిస్ట్రార్ కి ఆదేశాలు ఇవ్వగా ఆ మేడం 2/3/2026 వ తేదీన కలివేరు గ్రామముకు వచ్చి పంచాయితీ ఆఫీసు నందు శ్రీరామ సొసైటీ కమిటీ సభ్యులను విచారణ జరిపి రుజువు చేసుకొని ఆర్ సి నెంబర్ వన్ ఏ ఆర్ /బి సి ఏం /2025 3-26 ద్వారా షేర్ క్యాపిటల్ ధనము సభ్యులు కట్టుకొనుటకు మనిషికి రూ 110/- చొప్పున చర్ల కో-ఆపరేటివ్ బ్యాంకు మేనేజర్ ని ఆదేశిస్తూ ఇచ్చిన లెటరు ద్వారా 12 మంది సభ్యులకు గాను రూ 1320/- బ్యాంకులో కట్టడమైనది అని తదుపరి పర్మనెంట్ రిజిస్ట్రేషన్ నెం కొరకు డి సి ఓ శ్రీనివాస్ ని కలువగా వారు కాలయాపన చేస్తూ ఒకరోజు మంచి రోజు అని, రెండో రోజు ఉద్యోగములో చేరిన రోజు, ఆ ముహూర్తం మంచిది కాదంటూ కాలము గడిపి తదుపరి మంత్రితో కాని వాళ్ళ పిఏ నుండి కానీ చెప్పించుకోండీ అని చెప్పి కాలయాపన చేస్తూ ప్రస్తుతము ఒక రాజకీయ నాయకుని అనుచరునికి చేయడానికి ఇష్టపడుతూ మీకు చేస్తాను అని చెప్పాను గానీ కుదరదు వేరేవాళ్ళకు చేస్తాను అని చెప్పుచూ వాళ్ళకు అక్రమంగా చేయటానికి కలివేరు గ్రామమునకు ఫీజుబులిటీ వెరిఫికేషన్ కు వెళ్ళాల్సి వుండగా, దుమ్ముగూడెం మండలములో గోప్యముగా చేయటానికి సిద్ధపడినారు అని తెలిసినది అని డి సి ఓ శ్రీనివాస్ అనవసర విధానముల వలన సుమారుగా 7 నెలలుగా ఆయన చుట్టూ తిప్పుకుంటూ మమ్మల్ని ఇబ్బంది పెట్టారు అని అధికారులు ఈ విషయాన్ని సమగ్రముగా పరిశీలించి మా సొసైటీ (శ్రీరామ) పర్మనెంట్ రిజిస్ట్రేషన్ కోసం ఆదేశించవలసినదిగా కోరుతున్నామని అన్నారు .



# మహిళా బిల్లుకు బ్రేక్

- **లోక్ సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు వీగింపు**
- **మూడింట రెండు వంతుల మెజారిటీ దక్కక బిల్లు విఫలం**
- **మహిళా రిజర్వేషన్ బిల్లుపై రాజకీయ దుమారం**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 17, ప్రజా జ్యోతి:**
చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్ సభలో ఆమోదం పొందకపోవడం దేశవ్యాప్తంగా రాజకీయ చర్చలకు దారితీస్తోంది. ఈ బిల్లుకు అనుకూలంగా 298 మంది, వ్యతిరేకంగా 230 మంది ఓటు వేయగా, అవసరమైన మూడింట రెండు వంతుల ప్రత్యేక మెజారిటీ సాధించలేకపోయింది. బిల్లు వీగిపోవడంతో పాటు, నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన ఇతర బిల్లులను కూడా కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవడం గమనార్హం. దీంతో లోక్ సభ స్థానాలను పెంచే ప్రక్రియకు తాత్కాలికంగా బ్రేక్ లు పడ్డాయి. ఈ పరిణామం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మహిళా రిజర్వేషన్లపై కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఒకవైపు చెబుతుండగా, ప్రతిపక్షాలు తమ వైఖరిని సమర్థించుకుంటున్నాయి. జిల్లాలోని రాజకీయ నాయకులు, సామాజిక కార్యకర్తలు కూడా ఈ అంశంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. మహిళలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతుండగా, బిల్లుపై ఏకాభిప్రాయం కుదరలేకపోవడం దురదృష్టకరమని పేర్కొంటున్నారు. మొత్తానికి, మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోవడం దేశవ్యాప్తంగా మాత్రమే కాకుండా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ చర్చలకు దారి తీసింది. రాబోయే రోజుల్లో ఈ బిల్లుపై కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో అన్నది ఆసక్తికరంగా మారింది.

### ››› కేంద్ర వైఫల్యమే

**పోలెబోయిన శ్రీవాణి, కాంగ్రెస్ నాయకురాలు**



మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోవడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యాన్ని స్పష్టంగా చూపుతుందని జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు పోలెబోయిన శ్రీవాణి అభిప్రాయపడ్డారు. మహిళలకు న్యాయం చేస్తామని చెప్పి సరైన మెజారిటీని సమకూర్చుకోలేకపోవడం దురదృష్టకరమన్నారు. ఇది కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే తీసుకొచ్చిన బిల్లు అని, నిజంగా మహిళల సాధికారతపై ఆసక్తి ఉంటే అన్ని పార్టీలతో చర్చించి ఏకాభిప్రాయం సాధించాల్సిందని పేర్కొన్నారు.

### ››› ప్రణాళికలో లోపం

**బానోతు హరిప్రియ నాయక్, మాజీ ఎమ్మెల్యే**



మహిళా రిజర్వేషన్ అంశం ఎంతో కీలకమైందని మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ నాయక్ తెలిపారు. కానీ కేంద్ర ప్రభుత్వం దీనిని సరైన ప్రణాళికతో ముందుకు తీసుకురాలేకపోయిందని విమర్శించారు. దేశవ్యాప్తంగా సమాన అభివృద్ధి కోసం మహిళలకు ప్రాతినిధ్యం అవసరమని, బిల్లును రాజకీయంగా ఉపయోగించుకోవడం సరికాదన్నారు. అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని మళ్లీ బిల్లు తీసుకురావాలని సూచించారు.

### ››› ప్రతిపక్షాల అడ్డంకులే కారణం

**కుంజా ధర్మా, బీజేపీ నాయకులు**



మహిళా రిజర్వేషన్లపై కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా బీజేపీ నాయకుడు కుంజా ధర్మా స్పష్టం చేశారు. బిల్లుకు కావాల్సిన మద్దతు ఇవ్వకుండా ప్రతిపక్షాలు అడ్డుపడ్డాయని ఆరోపించారు. మహిళలకు సముచిత స్థానం కల్పించాలన్న ఉద్దేశంతోనే ఈ బిల్లు తీసుకువచ్చామని, భవిష్యత్తులో మరింత బలంగా తీసుకురావడానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు.

### ››› రాజకీయాల కంటే మహిళల హక్కులు ముఖ్యం

**భూక్యా రమేష్, సిఐటియూ నాయకులు**



మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోవడం బాధాకరమని సి ఐ టి యూ నాయకులు భూక్యా రమేష్ అభిప్రాయపడ్డారు. రాజకీయ పార్టీల మధ్య విభేదాల వల్ల మహిళల హక్కులు పక్కన పడుతున్నాయని విమర్శించారు. రాజకీయ లాభ నష్టాల కంటే మహిళల సాధికారతకు ప్రాధాన్యత ఇవ్వాలని, అన్ని పార్టీలు కలిసికట్టుగా పనిచేసి బిల్లును ఆమోదింపజేయాలని కోరారు.

## రహదారి ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

- **ట్రాఫిక్ నియంత్రణను కట్టుదిట్టం చేయండి**
- **మల్టీ జోన్ 1 ఐజి ఎస్. చంద్రశేఖర్ రెడ్డి**






**అశ్వారావుపేట, ఏప్రిల్ 17,ప్రజాజ్యోతి :** రహదారులపై జరిగే ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ ను నియంత్రించేందుకు కట్టుదిట్టంగా వ్యవహరించాలని మల్టీజోన్ 1. ఐజి ఎస్ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని దమ్మపేటలో ప్రజాపాలన.. ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన అవగాహన సదస్సుకు హాజరైన చంద్రశేఖర్ రెడ్డి తిరుగు ప్రయాణంలో అశ్వారావుపేట పోలీస్ స్టేషన్ ను అకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు సర్కిల్ పరిధిలో చోటుచేసుకున్న రహదారి ప్రమాదాలపై వివరాలు అడిగి తెలుసుకున్న ఆయన నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై పోలీసులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారులపై జరిగే ప్రమాదాలను నియంత్రించేందుకు ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలతో పోలీసులు సానుకూల ధ్వరణలో వ్యవహరిస్తూ విధులను సమర్ధవంతం గా నిర్వహించాలని ఇటువంటి పొరపాటుకు అవకాశం ఇవ్వకుండా ఉత్తమ సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, డి.ఎస్.పి సతీష్ కుమార్, సీఐ నాగరాజు, అశ్వారావుపేట, దమ్మపేట ఎస్ఐలు యాయాతి రాజు సాయి కిషోర్ రెడ్డి అదనపు ఎస్సై అఖిల, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

